క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

బండ్లగూడ: హిమాయత్‌సాగర్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్లలో శుక్రవారం విద్యుత్ అంతరాయం విధిస్తున్నట్లు ఏఈ పి.శ్రీనివాస్ తెలిపారు. కె.కె.నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు కెకె-1, 2, ఫీల్డ్ గూడ్ హోమ్స్, గంధంగూడ, సాయిబాలాజీనగర్, పెద్దమంగళారం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు హీరా కాలనీ, సన్‌సిటీ మెయిన్ రోడ్డు, సివైఆర్ కన్వెన్షన్, భాగ్యనగర్ ఓల్డ్ కాలనీ, కపిలానగర్ తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

మణికొండ: విద్యుత్ వైర్లకు సమీపంలోని చెట్ల కొమ్మలను తొలగించే పనులను చేపడుతున్నందున శుక్రవారం మణికొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పంచవటి కాలనీలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, స్టూడియో ఎస్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2గంటల నుంచి 3గంటల వరకు, హనుమాన్‌నగర్, ప్లెజెంట్‌వ్యాలీ, శ్రీనివాసనగర్ కాలనీ, ట్రయల్స్ విల్లాస్, శివపురి కాలనీలకు మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు, జనచైతన్య కాలనీకి సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ జ్ఞానేశ్వర్ తెలిపారు.

నార్సింగి సబ్‌స్టేషన్ పరిధిలో....

నార్సింగి సబ్‌స్టేషన్ పరిధిలోని గిరిగిరిగడ్డ, ముప్పాహోమ్స్, మైహోం అవతార్ రోడ్డులలో ఉదయం 10గంటల ఉంచి 12 గంటల వరకు, నార్సింగి గ్రామం, మార్కెట్, మున్సిపల్ కార్యాలయం, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతాలలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు, వివేకానందనగర్, నార్సింగి హైట్స్, మార్వా టౌన్‌షిప్, సీవీఆర్ హోటల్, నార్సింగి మెయిన్‌రోడ్ ప్రాంతాలలో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఏఈ సందీప్‌రెడ్డి తెలిపారు.

తహసీల్దార్‌కు సన్మానం



శంషాబాద్: శంషాబాద్ తహసీల్దార్ నాగమణిని పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షులు జల్లపల్లి నరేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించారు. రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న రెవిన్యూ సమస్యలను పారదర్శకంగా పరిష్కరించాలని ఆమెను కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ



సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందిన మహిళలకు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ గురువారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడకు చెందిన డి.విజయలక్ష్మికి రూ.60వేల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితుడికి ఆర్థిక సహాయం



ప్రభాకర్‌కు ఆర్థిక సహాయం అందజేస్తున్న దయానంద్

రాజేంద్రనగర్: కేన్సర్‌తో బాధపడుతున్న బాధితుడికి సేవ్ ఎన్విరాల్‌మెంట్ వరల్డ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఆర్థిక సహాయాన్ని అందించారు. సంస్థ డైరెక్టర్లు ఆజామ్ మోహియుద్దీన్, కోరని దయానంద్ స్పందించి గురువారం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రభాకర్‌ను కలిసి 50 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.

25న స్పోర్ట్స్ ఎక్స్‌పో ప్రారంభం

మాదాపూర్: క్రీడాకారులకు కావాల్సిన అన్ని వస్తువులు స్పోర్ట్స్ ఎక్స్‌పోలో ఉంటాయని హైటెక్స్ బిజినెస్ హెడ్ శ్రీకాంత్ టీజీ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హైటెక్స్ బిజినెస్ సెంటర్‌లో స్పోర్ట్స్ ఎక్స్‌పో ఇండియా 2023కి సంబంధించిన పోస్టర్‌ను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా నుండి మల్లాఖంబ్, బాక్స్ క్రికెట్, సైక్లోథాన్, బాడీ బిల్డింగ్ వరకు ఎక్స్‌పోలో కావాల్సిన ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయన్నారు. ఈనెల 25 నుంచి 27 వరకు ఉంటుందని ఉదయం 9గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అందుబాటులో ఉంటుందని చెప్పారు. ప్రవేశం ఉచితమని తెలిపారు.

‘సీఆర్’ ఎక్స్‌లెన్స్



మహిళలకు శిక్షణ ఇస్తున్న ఫౌండేషన్ సభ్యులు (ఫైల్)



మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకుంటున్న డాక్టర్ వనశ్రీ (ఫైల్)

- మహిళల స్వయం ఉపాధికి ప్రత్యేక శిక్షణ కోర్సులు
- ఔషధ మొక్కల పెంపకం కూడా...
- కనీస రుసుముతో పేదలకు వైద్య పరీక్షలు

హఫీజ్‌పేట్ : కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ వృద్ధులు, మహిళలు, నిరుపేదలకు చేయూతనందిస్తుంది. ఫౌండేషన్‌లో మహిళల వెల్ఫేర్ సెంటర్, స్పోకెన్ ఇంగ్లిష్ అకాడమీ, హెల్త్ సెంటర్, కంటి పరీక్షలు, లైబ్రరీ, సమావేశం మందిరాలు, కమ్యూనిటీహాల్, సైకలాజికల్ కౌన్సిలింగ్ సెంటర్ వంటివి అందుబాటులో ఉన్నాయి. దాంతో పాటు వృద్ధుల ఆరోగ్యం కోసం అనేక ఔషధ మొక్కలతో పాటు కూరగాయలు, వృద్ధుల కోసం ప్రత్యేకంగా ఆరోగ్య కేంద్రంలో వార్డులు కూడా ఏర్పాటు చేశారు.

మహిళలకు ప్రత్యేక శిక్షణ...

బడుగు, బలహీన వర్గాలకు చెందిన ఆడపిల్లలకు పలు కోర్సుల్లో ప్రత్యేక శిక్షణను అందిస్తున్నారు. మహిళల స్వయం ఉపాధి కోసం కంప్యూటర్, స్పోకెన్ ఇంగ్లిష్, బ్యూటీషియన్ కోర్సు, టైలరింగ్, జ్యూట్ బ్యాగుల తయారీ, ఎంబ్రాయిడరీపై శిక్షణ ఇస్తున్నారు. సీఆర్ ఫౌండేషన్ సహకారంతో ఇప్పటి వరకు 10వేల మంది మహిళలు లబ్ధి పొందినట్లు సభ్యులు తెలిపారు.

పేదలకు వైద్యం..

నిరుపేదలకు సీఆర్ ఫౌండేషన్‌లో ప్రత్యేక ప్రాథమిక ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. కంటి వైద్య పరీక్షలను రూ.30కే అందించడంతో మంచి స్పందన వస్తుంది. ఎల్వీ ప్రసాద్ కంటి ఆస్పత్రితో ఒప్పందం కుదుర్చుకొని గత సంవత్సరం నుంచి కంటి పరీక్షలను నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలు సీఆర్ ఫౌండేషన్ సభ్యులతో పాటు పక్కనున్న బస్తీలు వాసులు కూడా సద్వినియోగం చేసుకునేలా ఏర్పాట్లు చేశారు.

కదలలేని స్థితిలో ఉన్న వృద్ధులకు..

వృద్ధులు కదల్లేని స్థితిలో ఉన్న వారికి సీఆర్ ఫౌండేషన్‌లో ప్రత్యేక వార్డు ఏర్పాటు చేశారు. ప్రాథమిక చికిత్సకు వైద్యులను అందుబాటులో ఉంచారు. మంచానికే పరిమితమయ్యే వృద్ధులకు 24 గంటలు నర్సింగ్ సర్వీస్ కూడా అందుబాటులో ఉంచారు. ఇందులో ఆరు పడకలను ఏర్పాటు చేశారు. ఇక సీఆర్ ఫౌండేషన్‌లో ఖాళీ స్థలాన్ని ఉద్యానవనంగా తీర్చిదిద్దేందుకు ప్రగతి రిసార్ట్స్ అధినేత డాక్టర్ డీవీకె రావు సౌజన్యంతో పలు రకాల ఔషధ మొక్కలు, పూల మొక్కలు నాటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని నెలకొల్పారు.

ఎక్స్‌లెన్స్ అవార్డు...

గత 15 సంవత్సరాలు మహిళల సంక్షేమం, మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తున్న వారికి సామాజిక చైతన్యం కలిగించడంలో సంక్షేమ కేంద్రం కమిటీ సభ్యుల కృషి వల్ల సోషల్ ప్రోగ్రెస్ నిర్వహిస్తున్న మహిళా సంక్షేమ కేంద్రానికి 2020 ఎక్సెలెన్స్ అవార్డు దక్కింది. రాష్ట్ర మంత్రి కెటీఆర్ చేతుల మీదుగా ఫౌండేషన్ కన్వీనర్ వనశ్రీ అందుకున్నారు.

యాంఫీ థియేటర్ ఏర్పాటు..

సీఆర్ ఫౌండేషన్‌లోని వృద్ధాశ్రమంలో నివాసముండే మల్లంపాటి మురళి, మల్లంపాటి వెంకటేశ్వరరావులు తమ సొంత డబ్బులతో నూతనంగా దాసరి నాగభూషణం పార్కులో వాకింగ్ ట్రాక్, సీఆర్ కళాక్షేత్రంలోని ఓపెన్ ఎయిర్ థియేటర్‌లను నిర్మించారు. ఈ రెండింటిని ఇటీవల ప్రారంభించారు. వృద్ధులకు ఉదయం, సాయంత్రం సరదాగా నడవాలన్నా, కాసేపు కూర్చొని నాటకాలు చూడడానికి బాగుంటుంది.



కొండాపూర్‌లోని చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్



సీఆర్ ఫౌండేషన్‌లోని యాంఫీ థియేటర్



రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయం ముందు ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ శ్రేణుల ఆందోళన

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ కార్యాలయం గురువారం బీజేపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల నినాదాలతో దద్దరిల్లింది. రాజేంద్రనగర్ సర్కిల్‌కు చెందిన నాయకులంతా పెద్ద సంఖ్యలో కార్యాలయం ముందు ఆందోళనకు దిగారు. అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, పింఛన్లు, తెల్ల రేషన్ కార్డులు, నిరుద్యోగ భృతి ఇవ్వాలంటూ ఆందోళన నిర్వహించారు. కార్యాలయం ద్వారం ముందు నాయకులు, కార్యకర్తలు బైఠాయించడంతో కార్యాలయంలోకి అధికారులు, సిబ్బంది వెళ్లలేకపోయారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు ఆందోళనకు దిగిన ప్రజాప్రతినిధులతో పాటు నాయకులు, కార్యకర్తలందరిని అదుపులోకి తీసుకోని స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచికత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్, మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, మొండ్ర సంగీతగౌరీశంకర్, నియోజకవర్గ పార్టీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్, ఎస్.మల్లారెడ్డి పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్

శంషాబాద్ : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి జిల్లా ఆనంద్ డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.తెలంగాణ రాష్ట్రంలో విద్యావ్యవస్థ గాడితప్పిందన్నారు. కళాశాలలు, పాఠశాలలో అధ్యాపకులు, ఉపాధ్యాయుల భర్తీని కూడా ప్రభుత్వం వెంటనే చేపట్టాలన్నారు. ప్రణయ్, వర్ధన్, జగదీష్, మణికంఠ, ఈశ్వర్, అక్షయ్, ప్రసాద్, నాని, సోయెల్ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ డబుల్‌బెడ్‌రూం ఇళ్లు ఇవ్వాలి

మణికొండ: బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడి 9 సంవత్సరాలు అయినా రెండు ఎన్నికల్లో ఇచ్చిన ప్రధాన హామీ అయిన అర్హులందరికీ డబుల్ బెడ్ రూం గృహాలు ఇస్తామన్న హామీ ఇప్పటి వరకు నెరవేర్చలేదని, వారందరికీ వెంటనే వాటిని మంజూరు చేయాలని భారతీయ జనతాపార్టీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జి టి.అంజన్‌కుమార్ ఆద్వర్యంలో గండిపేట తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు యత్నించారు. తహసీల్దార్ కార్యాలయం ముందు ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం పోలీసుల అనుమతితో నయాబ్ తహసీల్దార్ జంగయ్యకు వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల పార్టీ అధ్యక్షులు సీహెచ్. బిక్షపతియాద్, సి.బీరప్ప పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

బీజేపీ నాయకుల ముందస్తు అరెస్టు

మణికొండ: రాష్ట్రంలోని పేదలందరికీ డబుల్‌బెడ్ రూం గృహాలు, కొత్త రేషన్ కార్డులను మంజూరు చేయాలనే డిమాండ్‌తో గండిపేట మండల తహసీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం చేపట్టడంతో బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టులు చేశారు. మణికొండ మున్సిపాలిటీ నుంచి గండిపేటకు బయలు దేరుతున్న నాయకులను అరెస్టు చేసి రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మణికొండ మున్సిపల్ వైస్ చైర్మెన్ కె. నరేందర్‌రెడ్డి, బీజేపీ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు సి.బీరప్ప, కోఆప్షన్ సభ్యుడు జె. సిద్దప్పలతో పాటు నాయకులు ఉన్నారు. మధ్యాహ్నం తరువాత వదలిపెట్టారు.



రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఉన్న బీజేపీ నాయకులు


ప్రజావసరాలకు పెద్దపీట



ఎల్ఐసీ కాలనీలో పార్కును ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: మున్సిపాలిటీలలో నివసిస్తున్న ప్రజలకు అవసరమైన సౌకర్యాలు, అవసరాలకు అనుగుణంగా వాటికి పెద్దపీట వేసి అభివృద్ధి పనులను చేపడుతున్నామని ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ అన్నారు. గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఆయన మణికొండ మున్సిపాలిటీ పరిధిలో రూ 4.30 కోట్లతో అభివృద్ధి చేసిన ఎల్ఐసీ కాలనీలోని ఎల్ఐసీ పార్కు, అలకాపూర్ టౌన్‌షిప్ రోడ్డు నెంబర్ 7లోని శివాజీ మహారాజ్ పార్క్, రోడ్డునెంబర్ 6లోని ఫ్రీడమ్ పార్క్, రోడ్డు నెంబర్ 30లోని జయశంకర్ పార్క్‌లను ఆయన మున్సిపల్ చైర్మెన్ కె.నరేందర్‌ముదిరాజ్, వైస్ చైర్మెన్ కె.నరేందర్‌రెడ్డి, కమీషనర్ కె. ఫల్గుణ్‌కుమార్‌లతో కలిసి ప్రారంభించారు. మున్సిపాలిటీల పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వారికి రోడ్లు, తాగునీరు, విద్యుత్, పార్కులను అందించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి, డీఈ దివ్యజ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థులకు చెక్కతో తయారు చేసిన బ్రష్‌ల పంపిణీ



ఎయిర్‌పోర్టు కాలనీ విద్యార్థులకు వెదురు బ్రష్‌లను అందజేసిన రోటరీ క్లబ్

శంషాబాద్: పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేదించి.. పచ్చదనానికి బాటలు వేయాలని రోటరీ క్లబ్ హిమాయత్‌నగర్ అధ్యక్షుడు టి. ఆనందర్ కుమార్ సూచించారు. ఎయిర్‌పోర్ట్ కాలనీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వెదురు కర్రలతో తయారు చేసిన పళ్లు తోముకునే బ్రష్‌లకు అందజేశారు. గో గ్రీన్..అవాయిడ్ ప్లాస్టిక్ నినాదంతో భాగంగా పర్యావరణహితమైన వాటిని అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు రాకేష్, డాక్టర్ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

భవిష్యత్తు పట్టణ ప్రణాళికలో ఏఐ కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఫ్లోరిడా యూనివర్సిటీ ప్రొఫెసర్ జోంగ్ రెన్‌పెంగ్

రాయదుర్గం: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పట్టణ ప్రాంత పునర్నిర్మాణం, ప్రణాళిక మార్పునకు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఎంతో అవసరమని ఫ్లోరిడా యూనివర్సిటీ ప్రొఫెసర్ జోంగ్ రెన్‌పెంగ్ పేర్కొన్నారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ డీన్ రమణమూర్తి అధ్యక్షతన జరిగిన «ఏఐ- ఎనేబుల్డ్ అర్బన్ ప్లానింగ్ అండ్ ట్రాన్స్‌పోర్టేషన్ ఫర్ క్లైమేట్ అడాప్టేషన్» అనే అంశంపై ఉపన్యాసం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థిరమైన అభివృద్ధి, రవాణా ప్రణాళిక, వాతావరణ మార్పుల కోసం అనుసరణ ప్రణాళిక, పట్టణ ప్రణాళికలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

మనూలో రెండ్రోజుల సదస్సు ప్రారంభం

రాయదుర్గం: రాజకీయాలు మతానికి గుడ్డిగా కట్టుబడి ఉండటాన్ని మౌలానా ఆజాద్ వ్యతిరేకించారని న్యూఢిల్లీ ఎన్‌యూఈపీఏ మాజీ మౌలానా ఆజాద్ చైర్ ప్రొఫెసర్ సయ్యద్ ఇర్ఫాన్ హబీబ్ అన్నారు. గురువారం గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో మౌలానా ఆజాద్ చైర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ (ఎంసీజే) సంయుక్త ఆధ్వర్యంలో రెండురోజుల సమావేశం ప్రారంభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో సహ జీవనం, శాంతిని పెంపొందించే ప్రతి మతాన్ని గౌరవించాలంటూ మౌలానా చేసిన కృషిని ఆయన వివరించారు. కొలంబియా యూనివర్సిటీ ఎర్లీకెరీర్ ఫెలో డాక్టర్ షాన్నారోడ్రిగ్స్ మాట్లాడుతూ మౌలానా ఆజాద్‌ను రాజకీయ ఆలోచనాపరుడుగా అభివర్ణించారు.

రహదారిపై పాఠశాల వద్ద బారికేడ్లు ఏర్పాటు

శంషాబాద్ రూరల్: రామంజాపూర్ ప్రభుత్వ పాఠశాల వద్ద రహదారిపై పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. మితిమీరిన వేగంతో వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో విద్యార్థులు ప్రమాదాల బారిన పడకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరడంతో ఈ మేరకు గురువారం వీటిని ఏర్పాటు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపారు. ఏసీపీ సూచన మేరకు శంషాబాద్-షాబాద్ రహదారిపై ప్రమాదాల నివారణ కోసం తగు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఐ రాజ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఏడుగురికి జైలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పలు కేసుల్లో పట్టుబడ్డ వారిలో ఏడుగురికి న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్.బోస్‌కిరణ్ తెలిపిన మేరకు.. రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించి మద్యం సేవించి వాహనం నడిపిన వారు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన, డ్రైవింగ్ లైసెన్స్ రద్దైన తరువాత కూడా వాహనాలు నడిపిన 27 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. వారిని గురువారం ఉప్పర్‌పల్లిలోని 3వ స్పెషల్ ఎంఎం కోర్టు మెజిస్ట్రేట్ నజీరుద్దీన్‌షా ముందు హాజరుపరిచామన్నారు. 27 మంది ప్రతివాదులలో ఏడుగురికి జైలు శిక్షను విధించారు. అందులో ఇద్దరికి రెండు రోజుల చొప్పున, ముగ్గురికి మూడు రోజులు చొప్పున ఇద్దరికి నాలుగు రోజుల చొప్పున జైలు శిక్ష విధించారన్నారు. అదే విధంగా మిగిలిన వారికి జరిమానా విధించారన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడిపిన ఇద్దరికి జైలు

మణికొండ: మద్యం మత్తులో వాహనాలు నడిపి ట్రాఫిక్ పోలీసులకు చిక్కిన ఇద్దరికి రాజేంద్రనగర్ కోర్టు జైలు శిక్షను విధించినట్టు నార్సింగి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీ చేపట్టగా అందులో మద్యం తాగి చిక్కిన గణేష్‌కు 3 రోజుల జైలు శిక్షతో పాటు రూ. 3500ల జరిమానా విధించిందన్నారు. మరో వ్యక్తి రాంచందర్‌కు 3 రోజుల జైలు, రూ. 5వేల జరిమానా విధించిందని పేర్కొన్నారు.

మైనార్టీ ఫంక్షన్‌హాల్ నిర్మించాలి

ఎమ్మెల్యే గాంధీని కలిసిన మైనార్టీ నాయకులు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ముస్లింలకు మైనార్టీ ఫంక్షన్‌హాల్ మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలంటూ గురువారం కొండాపూర్ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, మధ్యతరగతి మైనార్టీలకు ఈ ఫంక్షన్ హాల్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అలాగే అర్హులైన వారికి డబుల్ ఇళ్లు కేటాయించాలన్నారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే ప్రత్యేక ఫంక్షన్ హాల్ నిర్మాణం, ముస్లింల శ్మశానవాటికల అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు హబీబ్, మహ్మద్ బేగ్, అక్తర్, ఖాసీమ్, అష్రాఫ తహిర్, అక్బర్, జమీర్‌ఖాజా తదితరులు పాల్గొన్నారు.

చెరువుల్లోకి చేపపిల్లలు వదిలిన మత్స్య సహకార సంఘం నేతలు



మంచిరేవుల చెరువులో చేపపిల్లలను వదులుతున్న మత్స్య సహకార సంఘం నాయకులు

మణికొండ: రాష్ట్ర మత్స్య సహకార సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా మంజూరు అయిన 1.50లక్షల చేపపిల్లలను స్థానిక సంఘం నాయకులు చెరువులో వదిలారు. నార్సింగి మున్సిపాలిటీ, మంచిరేవుల ఇటికెన్ చెరువులో గురువారం సహకార సంఘం నాయకులు వాటిని వదిలారు. సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌ముదిరాజ్, ఉపాధ్యక్షుడు రాజు ముదిరాజ్, కార్యదర్శి శంకరయ్య ముదిరాజ్ పాల్గొన్నారు.

పాదచారుల సౌకర్యార్థం ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తాం

రాజేంద్రనగర్: రోడ్లు దాటేందుకు వీలుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించనున్నట్లు రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే టి.ప్రకాష్‌గౌడ్ వెల్లడించారు. గురువారం జాతీయ రహదారి ఎన్‌హెచ్-44 బుద్వేల్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో ఆయన పర్యటించారు. నేషనల్ హై వే అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజలు రోడ్లు దాటే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. జాతీయ రహదారులపై వాహనాలు వేగంగా వస్తాయని వాటిని గమనించి రోడ్లను దాటాలన్నారు. జాతీయ రహదారి ఎన్‌హెచ్-44 వద్ద రోడ్లు దాటే సమయంలో అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఎన్‌హెచ్ ఈఈ, డిఈ, ఏఈ, స్థానిక నాయకులు మాధవరెడ్డి, సుధాకర్‌గౌడ్ తదితరులున్నారు.



బుద్వేల్ రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఎన్‌హెచ్-44 రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

స్టార్ ఆస్పత్రిలో ‘ఇల్యూమినా’ ప్రారంభం



ప్రారంభ కార్యక్రమంలో డీఐజీ సుమతి, డాక్టర్లు

రాయదుర్గం: అందానికి సొబగులద్దే ‘ఇల్యూమినా’ను నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలోని స్టార్ ఆస్పత్రిలో గురువారం ప్రారంభించారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్‌శాఖ మహిళా భద్రతా విభాగం డీఐజీ సుమతి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వైద్య రంగంలో ఎన్నో మార్పులు వస్తున్నాయని, వాటన్నింటిని రోగులకు అందుబాటులోకి తీసుకురావడంతో హైదరాబాద్ నగరం మెడికల్ హబ్‌గా మారిందన్నారు. స్టార్ ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపిచంద్ మన్నం, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ గూడపాటి మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలలో అధునాతన అవకాశాలను స్టార్ ఆస్పత్రులలో అందుబాటులోకి తెచ్చామన్నారు. ఫేస్‌లిఫ్ట్ నుంచి బ్రెస్ట్ రిడక్షన్, హ్యాండ్ సర్జరీ, బర్న్స్, ట్రామా, పోస్ట్ బెరియాట్రిక్, ట్రీట్‌మెంట్స్, సర్జరీలతోపాటు నాన్ సర్జికల్ చికిత్సలను పొందాలంటే యూరప్, అమెరికా వంటి దేశాలకు వెళ్ళాల్సి వచ్చేదని ప్రస్తుతం ఈ టెక్నాలజీని స్టార్ ఆస్పత్రిలో అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐఐ ఐడబ్ల్యూఎన్ చైర్‌పర్సన్ శ్రీవిద్యారెడ్డి, ఫ్యాషన్ ఐకాన్ శిల్పారెడ్డి, విభాగాధిపతి డాక్టర్ రాజేష్‌వాసు, పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.